ప్రముఖ వ్యక్తులు

# "ఏదో ఫరవాలేదు!"

శ్రీరంగం శ్రీనివాసరావు

అంతర్జాతీయ విఖ్యాతి ఆర్జించినవారే ప్రముఖవ్యక్తులు కానక్కరలేదు. మారుమూలల పల్లెటూళ్ళలోకూడా పేరులేని ప్రముఖవ్యక్తులుంటారు. అటువంటి ప్రముఖవ్యక్తినొకాయనని నేను పేరుచెప్ప నవసరంలేని ఒక పల్లెటూరులో కలుసుకున్నాను. ఆయనమాత్రం పేరులేనివాడు కాడు. చాలా మంచిపేరే ఉంది; అదేదో నేనైతే మరిచిపోయానుగాని, ఆయనంటూ ఉండేవాడు ఏదో ఫర్వాలేదని.

పెళ్ళికొడు కెలాగున్నాడండీ అని అడిగితే ఆయన ఏదో ఫర్వాలేదనడం నాకు జ్ఞాపకం ఉంది. ఏమిటి దానర్థం అని తర్వాత లోపాయికారీగా నేను వారిని ప్రశ్నించాను. అప్పుడు పొద్దు వాటారుతున్న సమయం...అర్థ రాత్రి దాకా అతను వ్యాఖ్యానిస్తూనే ఉన్నాడు. నేరకపోయి అతన్ని కదలించానుకదా అని నేను మాచెడ్డ బాధపడ్డాను. ఆ పెళ్ళి సంబంధంతో ప్రారంభించి గ్రామంలో ఉన్న అన్ని కుటుంబాల అట్టుపట్టు అనవాళ్ళూ ఆయన ఏకరువు పెడుతున్నాడు. ఏదో ఫర్వాలేదని ఆయన ఎందుకన్నాడో మాత్రం బోధపడలేదు. ఆకలేస్తున్నాదని చెప్పి అక్కణ్ణించి వెళ్ళిపోయాను.

మర్నాడు ఆ పెళ్ళి తప్పిపోయింది. అప్పుడు తెలిసింది నాకు ఏదో ఫర్వాలేదు అంటే ఏమీ లాభంలేదు అని.

కాని ఇంకోమారు గేదెను కొనడం విషయంలో ఏదో ఫర్వాలేదని ఆయనగారనడమూ తక్షణమే బేరం ఫైసలు కావడమూ సంభవించింది. మరి దాని నేమనడం? ఏమిటి మీ ఉద్దేశం అని లోపాయికారీగా కాని బహిరంగంగా కాని వారి నడగడానికి సాహసించలేక పోయాను.

దేన్నీ మెచ్చుకోవడం చేతకానివాళ్ళూ, ఇష్టం లేనివాళ్ళూ ఏదో పర్వాలేదంటూ ఉంటారు. అజంతా చిత్రాన్ని చూపించినా వాళ్లు ఏదో పర్వాలేదనే అంటారు. తనకి తెలియని విషయం గురించి తప్పుకోవడానికికూడా ఈ "ఏదో పర్వాలేదు" మంత్రం బాగా పనికొస్తుంది. ఈ కోవల్లో దేనిలోకీ రానివాడు మా పల్లెటూరి ప్రముఖవ్యక్తి ఒక్కడే అనుకుంటాను. ఏదైనా మెచ్చుకోదగినదుంటే దాన్ని మెచ్చుకోవడం ఆయనకి బాగా చేతనవును. మినపరొట్టె ఆయన తింటున్నప్పుడు చూసినవాళ్ళంతా నా అభిప్రాయంతో ఏకీభవిస్తారు. ఒక్క మినపరొట్టెనే కాదు అజంతా చిత్రాన్నికూడా ఆయన ఆనందించగలడు. అలాగే తనకి తెలియని విషయంనించి తప్పుకోవడం ఒక్కటే అతనికి తెలియని విషయం. పేపర్లు రోజూ చదువుతూ ఉంటాడుగా...ఇహ ఆయనకి తెలియనివిషయం అంటూ ఏముంటుంది? కాబట్టి ఆయనకి సంబంధించినంతమట్టుకు తెలియని విషయంనించి తప్పుకోవడం అనే సమస్యే లేనేలేదు.

అటువంటివాడు ఏదో పర్వాలేదన్నాడంటే దాని అర్థం తెలుసుకోవడానికి చాలా దూరం వెళ్ళాలి. నేను చాలా దూరం వెళ్ళలేదుగాని చాలా కాలం గడిపాను, అసురసంధ్యనుంచి అర్థరాత్రిదాకా......కావలసింది అర్థం కాకపోయినా ఆయన గొప్పతనం మాత్రం అర్థమయింది.

ఇంత గొప్పవాడు అంతర్జాతీయ రంగంలో ప్రవేశించకుండా మారుమూలపల్లెటూళ్ళో మాటుమణిగిపోవడం దేవుడుచేసిన కీడు. అమెరికావాడు హైడ్రోజన్ బాంబు తయారు చేశాడంటే ఏదో పర్వాలేదని ఈయన ఎప్పుడన్నాడో అప్పుడు నేను అంతర్జాతీయ రంగాన్ని తలుచుకొని జాలిపడ్డాను. హైడ్రోజన్ బాంబు మీద ఈయన చేసిన ప్రకటనకి ఏవిధమైన ప్రచారమూ లభించకపోవడమే ఈనాడు ప్రపంచ

మంతటా ఏర్పడిఉన్న 'విపరీత విపత్కర పరిస్థితి'కి కారణమని నేనుదృఢంగా విశ్వసిస్తున్నాను.

విడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రంగా ఈయన ఏదో పర్వాలేదని అనేస్తూ ఉండడు. గేదె చేరం అయిన ఆరునెలలకి గాని హైడ్రోజన్ బాంబుమీద ప్రకటన రాలేదు. గేదె చేరమైన తక్షణమే హైడ్రోజన్ బాంబు తయారయిఉంటే అప్పుడే ఈయన తనప్రకటన చేసి ఉండడా అనేది వేరే సంగతి.

ఒక్కొక్క పల్లెటూళ్ళో ఇటువంటి ప్రముఖ వ్యక్తులుండబట్టే ఏ లేక్ సక్సెస్‌లోనో ఏ జెనీవాలోనో పరిష్కారంకాని అత్యంత క్లిష్టసమస్యలు సునాయాసంగా మన పల్లెటూళ్ళలో పరిష్కారమై పోతూ ఉంటాయి. ఆ సంగతి తెలియక నెలల తరబడి, వారాలతరబడి సమావేశాలతో సతమతమైపోయి ఆఖరికి అంతర్జాతీయ ప్రముఖవ్యక్తులంతా ఏదో పర్వాలేదనే అభిప్రాయానికే వచ్చి తీరుతారు.

ఏ సమస్యకైనా ఏదో పర్వాలేదని ఊరుకోవడం ఎలా పరిష్కార మార్గమవుతుందని కొందరడగవచ్చును. అన్నిటికన్నా క్లిష్టసమస్య హైడ్రోజన్ బాంబు కాబట్టి దాన్నే ఉదాహారహారణగా తీసుకుందాం. ఏదో పర్వాలేదనడం కన్నా ఇంకేవిధంగా దీన్ని పరిష్కరించడం? ఇంచుమించు అంతర్జాతీయ సమస్యలన్నీ యింతే. ఏదో పర్వాలేదని కాకపోతే ఇంకేదో తత్తుల్యమైన పధకంమీదనే అవి పరిష్కారమవుతూ ఉంటాయి. ఆ పరిష్కారమునేదికూడా మున్ముందు మన పల్లెటూరి రచ్చబండలమీద ప్రముఖవ్యక్తులే సాధిస్తారని మరచిపోకూడదు.

పల్లెటూళ్ళో ప్రముఖవ్యక్తిని ప్రస్తుతానికి వదలిపెట్టి అంతగొప్పవాడు కాకపోయినా కొంత గొప్పవాడైన ఇంకో మహనీయుని సంగతి ముచ్చటించుకుందాం. ఇతగాడు పట్టణపక్షి. అదృష్టవశాత్తూ ఈయనపేరు బాగా జ్ఞాపకం ఉంది. ఆశ్చర్యపడకండి, చెబుతాను. ఆ పేరు అల్లసాని పెద్దన. నేనేదో అబద్ధమాడుతున్నాననుకున్నారు కాదూ? లేదు. అల్లసాని పెద్దన అనేది ఈయన అసలుపేరు కాదు. పౌరుషానికి ధరించిన నామం. తాను కవినన్న సంగతి అందరికీ తెలియడంకోసం మొదటిసారిగా ప్రారంభించిన శతకంలో పది పద్యాలు పూర్తికాగానే ఈపేరు పెట్టుకొన్నాడు. ఆ శతకం ఇప్పటికీ పూర్తికాలేదులెండి.

అంతో యింతో గొప్పవాడైన ఈయనను ఆ రోజుల్లో కంసాలి వీరాచారి దుకాణంలో చూస్తూండేవాణ్ణి. తానూ, వీరాచారికూడా స్వర్ణకారులే కాబట్టి ఈ స్నేహం ఏర్పడిందేమో అనుకునేవాణ్ణి. కాని తర్వాత తెలిసింది. వీరాచారి కృష్ణదేవరాయలట. దుకాణం భువనవిజయాఖ్య సంసద్భవనమట. సరే అల్లసాని పెద్దన గారు అల్లసాని పెద్దనగారే. ఆ సమయానికి పోగయినవారే అష్టదిగ్గజాలు. వీరొక్కొక్కప్పుడు అయిదుగురే ఉంటారు. వేరొక్కొక్కప్పుడు పది పన్నెండుగురుంటారు.

దివాణంలోకి-అదే, దుకాణంలోకి ఎవరైనా కొత్తగా పద్యంరాసుకొచ్చి చదివితే మన అల్లసాని పెద్దనగారు ఏదో పర్వాలేదంటూ ఉంటారు. ఈ అనడంలో ఎప్పుడూ ఉచ్చారణభేదంమాత్రం ఉంటుంది. ఈ అభినయం రెండే రెండువిధాలు: పెదవి విరిచి అరచేతితో గాలిని వెళ్ళిపొమ్మనడం, చిరునవ్వుతో అదే అరచేతితో గాలిని బుజ్జగించడం. రెండుసందర్భాలలోనూ నోటినించి వెలువడ్డ మాటల్లో ఏ భేదమూ లేకపోయినా వాటి కనుబంధించిన అభినయాలనుబట్టి పెదవి విరిచి నప్పుడు పద్యం బాగులేదనీ, చిరునవ్వు నవ్వినప్పుడు బాగుందనీ సభాసదులందరూ గ్రహిస్తారు.

అల్లసాని పెద్దనగారి చిరునవ్వు భువనవిజయాఖ్యంలో ప్రవేశానికి కాంప్లిమెంటరీ టిక్కట్టులాంటిది. పెదవి విరుపు అర్ధచంద్రప్రయోగమని వేరే చెప్పనక్కరలేదు. కాంప్లిమెంటరీ టిక్కట్టు సంపాదించిన అదృష్టవంతుడు కొంతకాలం అష్టదిగ్గజాలలో ఒకడుగా దుకాణంలో ప్రకాశిస్తాడు. అయ్యలరాజు రామభద్రుడనో నాచన సోమనాథుడనో అనిపించుకుంటాడు. అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. దుకాణంలో దిగ్గజాలు ఎనమండుగురే అయిఉండడం ఎంత అనవసరమో అలాగే కృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాలే అయి ఉండడంకూడా అంతే అనవసరం. అంతేకాదు వాళ్ళు కృష్ణదేవరాయలకి పూర్వం ఉండిన కవులే కానక్కరలేదు. ఒక సందర్భంలో

ఒక కాంప్లిమెంటరీ టిక్కెట్టు హోల్డర్‌ని అడిదం సూరకవి అని మన అల్లసాని పెద్దనగారవడం నాకు జ్ఞాపకం ఉంది. అంతతో అతను ఉప్పొంగిపోయి—

ఊరెయ్యది? చీపురుపలి
పేరో? సూరకవి. ఇంటిపే? రడిదమువార్,
మీ రాజు? విజయరామ మ
హారా, జత డేమిసరసనడా? భోజుడయా.

అని గడగడా చదివెయ్యడమూ, అయితే అక్కడికే పో ఇది కృష్ణదేవరాయల ఆస్థానం అని తక్షణమే అతన్ని అల్లసాని పెద్దన సాగనంపడమూ జరిగింది.

మను చరిత్రమీద ఏమిటి మీ అభిప్రాయమని ఒకసారి అల్లసాని పెద్దనగారిని అడిగాను. గాలిని బుజ్జగిస్తూ ఏదో పర్వాలేదంటాడని అనుకున్నాను. తప్పనిసరిగా చిరునవ్వు నవ్వుతాడనుకున్నాను. కాని నేననుకున్నదానికి విరుద్ధంగా ఆయన పెదవి విరిచేశాడు. గాలిని కంపించేశాడు. ఉదాత్తనుదాత్తస్వరాలతో ఏదో పర్వాలేదన్నాడు. ఇది చాలా విడ్డూరమనిపించింది: మనుచరిత్రమీదేమిటి, అల్లసాని పెద్దనగారికేమిటి, ఇంత అమానుషమైన అభిప్రాయం ఉండడమేమిటి అనుకున్నాను. ఇందులో కీలకం ఏదో ఉంటుందని దాన్నెలాగైనాసరే కనిపెట్టాలనున్నాను. కొంతకాలానికి నా పరిశ్రమ ఫలించింది. కారణం దొరికింది.

అనేక సందర్భాలలో అనేకులను అనేక కవుల పేర్లతో అల్లసాని పెద్దనగారు ఆదరించారుగాని ఎప్పుడూ, ఏ సందర్భంలోనూ ఎవ్వరినీ రామరాజభూషణుడని పిలవడం నేను వినలేదు. అష్టదిగ్గజాలకి నాయకుడన్న కారణంచేత మాత్రమే అల్లసాని పెద్దన గౌరవనీయుడయాడు. శతకంలోని పది పద్యాలు రాస్తున్నప్పుడే అతనిదృష్టి దుకాణంమీద పడింది. వీరాచారి కృష్ణదేవరాయలుగా కనబడినప్పుడే తాను అల్లసాని పెద్దనగా మారిపోయాడు. ఆ తర్వాతనే అతడు మనుచరిత్రా వసుచరిత్రా చదివాడు. మనుచరిత్ర బోధపడింది; వసుచరిత్ర బోధపడలేదు. అందుచేత అతనికి రామరాజభూషణుడు అందరికన్నా గొప్పకవిగా కనిపించాడు. పదవికోసం అల్లసాని పెద్దన నామధేయాన్ని వదలుకోలేకపోతున్నాడుగాని, అంతరాంతరాల్లో ఆయనకి రామరాజభూషణుడు కావాలనే ఉంది. అందుచేతనే మరెవరినీ ఎప్పుడూ ఆయన రామరాజభూషణుడని అనలేదు.

ఒక పద్యంలో ఒక అర్థాన్ని ఇముడ్చడానికే తలప్రాణం తోకకొస్తున్నాదే, ఒక పద్యంలోనే రెండర్థాలు ఇముడ్చడం ఎలాగ అన్నదే అల్లసాని పెద్దనగారికి గొంతుపట్టినది, అంతుపట్టనిదీను. సునాయాసంగా శ్లేషించగలిగిన రామరాజభూషణుడంటే అందుకే ఆయనకంత భయమూ, భక్తీను. భయం ఎందుకంటే అలా తాను ఎంత ప్రయత్నించినా రాయలేకపోవడంవల్ల; భక్తి ఎందుకంటే ఆ పద్ధతి తనకు అత్యంతంగా నచ్చడంవల్ల.

ఒకసారి వాదానికొక ద్వ్యర్థకవివచ్చాడు. అల్లసాని పెద్దనగారి గుండెల్లో రాయిపడింది. వీరాచారి పరంగా ఒక అర్థమూ, వర్షాకాలం పరంగా ఇంకో అర్థమూ వచ్చేటట్టు సీసపద్యం రాసుకొచ్చానని చెప్పి చదివాడు. ఏదో పర్వాలేదనడానికి పెద్దనగారికి దమ్ములులేకపోయాయి. చిరునవ్వూలేదు. పెదవి విరుపూ లేదు. ఒంట్లో బాగులేదని చెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు.

ద్వ్యర్థకవిది ఆ వూరు కాదు. అష్టావధానం ఏర్పాటు చేయించండని అల్లసాని పెద్దనగారిని బతిమాలాడు. అవధానం అయిపోయిన వెంటనే స్వగ్రామానికి వెళ్ళిపోయే షరతుమీద అయితే ఏర్పాటుచేయిస్తానన్నాడు. ఒప్పందమయింది.

అష్టావధానం దిగ్విజయంగా జరిగిపోయింది. పృచ్ఛకులు చిత్రవిచిత్రాలైన ప్రశ్నలు వేశారు. ఆయన ద్వ్యర్థకవి కాబట్టి రెండేసి రెండేసి వస్తువులిచ్చి ఒక్కొక్క పద్యం చెప్పమన్నారు. కలంమీదా గరిటమీదాకలిపి చెప్పమని ఒకరడిగేరు. తుపాకిగుండుమీదా, గులాబిచెండుమీదా కలిపి సెలవియ్యండని ఇంకొకరడిగేరు. పకోడీపరంగాను, జిలేబీపరంగానూ చెప్పమని వేరొకరడిగేరు. అన్నిటికీ ఆశువుగా ఆయన పద్యాలుచెప్పేరు. మాకెవరికీ బోధపడలేదు. ప-కోడీ అనీ, జి-లేబీ అనీ విరుచుకోవాలని ఆయనన్నాడు. ఆహా అన్నారు అంతమందీ.

తర్వాత అష్టావధానం ఎలావుందని అల్లసాని పెద్దనగారినడిగితే ఏదో ఫర్వాలేదన్నారు. ఈ

అభిప్రాయం మాత్రం మామూలుగా జరిగే పెదవి విరుపుగాని చిరునవ్వు మెలపుగాని లేకుండానే సెలవిచ్చారు. అందుచేత అవధానం బాగుందనుకోవాలో, బాగులేదనుకోవాలో తేలిందికాదు.

అరే... చాలా పైమైపోయిందే. ఒక్కకవిని గురించే ఇంతసేపు ముచ్చటిస్తే ఇంకా చెప్పుకోవలసిన వారెంతమందో ఉన్నారే. అంతర్జాతీయ పరిస్థితినింకైనా పెందరాళే బయట పడగలిగాంగాని కవులతో కాలక్షేపం మొదలుపెడితే ఇలాగే ఉంటుంది; కవితావ్యాసంగంలో ఉన్న ఆకర్షణే అది. ప్రపంచంలో ఉన్న అన్ని అభిప్రాయాలూ కవిత్వంలో క్రోడీకరణం కావడం, అన్నిరసాలూ కేంద్రీకరణం కావడం ఆదేకాబోలు కవిత్వంలో ఉన్న విశిష్టత్వం.

సరే... ఈసారి సరాసరిగా బజారులోకొద్దాం. వాణిజ్యరంగం కూడా మానవ జీవితంలో విశేష ప్రాముఖ్యం వహించినదే కాబట్టి వణిక్ప్రముఖులలో ఏదో ఫర్వాలేదనే మనస్తత్వం ఎలాంటిదో పరిశీలిద్దాం. ఏదో ఫర్వాలేదని అనకపోవడమే ఈ మనస్తత్వం. వ్యాపారం ఎలా సాగుతోందని ప్రశ్నిస్తే ఏ వర్తకుడూ ఏదో ఫర్వాలేదని అనడు. అలా అనేస్తే మరేముంది? మూడుపువ్వులూ ఆరు కాయలుగా సాగిపోతోందని అంగీకరించడమే అన్నమాట. ఇతర జీవిత రంగాలన్నిటిలోనూ తతిమ్మావాళ్ళంతా తనకన్న తక్కువవాళ్ళే అనుకోవడం ఉండవచ్చునుగాని ఒక్క వాణిజ్యరంగంలోనే ఇందుకు విరుద్ధంగా పక్కవర్తకుడు తనకన్న ఎక్కువ లాభాలు లాగేస్తున్నాడని వాపోవడం ఉంది. ముఖ్యంగా ఏ అనాధ శరణాలయానికనో, ఏ క్షామపీడితుల సహాయానికనో చందాలకోసం వచ్చినవారికి ప్రతివర్తకుడూ తన పక్కవాడినే చూపించి అతడేగొప్పవాడని వేనోళ్ల పొగుడుతాడు. విధిలేక చందా వెయ్యవలసి వచ్చినా జాబితా అంతా జాగ్రత్తగా చూసి, అన్నిటికన్నా తక్కువమొత్తం వేసిన ప్రముఖుడి గొప్పతనం పొగిడి అంతకన్నా తక్కువ మొత్తం వేస్తాడు. అదైనా వెంటనే ఇచ్చేస్తే అడగొచ్చిన వాళ్లు అదృష్టవంతులే. అచ్చే అలా యెందుకు చేస్తాడు? శుక్రవారం అనో, అష్టమి అనో లేక ఆ రోజుకి ఏది సరిపోతుందో ఆ సాకుతో మరునాడో, మరి నాలుగురోజులు పోయాకో రమ్మంటాడు. వెదికేవాళ్ళకి సాకులేదొరక్కపోతాయా?

ఎంత గొప్పవాళ్లయ్యుండనీ ఏదో పరవాలేదని ఎప్పుడూ అనని వాళ్ళు ఒక వర్తకులే అయితే చిన్నవాళ్ళయినా ఏదో పర్వాలేదని ఎప్పుడూ అటూండేవాళ్ళు డాక్టర్లు. చిన్నవాళ్ల విషయం మనం చెప్పుకో నక్కరలేదు కాబట్టి పెద్దపెద్ద వైద్యశిఖామణులను గురించే మాట్లాడుకుందాం. ఎంత పెద్ద వైద్యుడైతే అతని కంత ఎక్కువ నిదానం అంటుంది. దేనికీ తొణకడు, బెణకడు. రోగికి ప్రాణం మీదికొచ్చినా ఏదో పర్వాలేదనే అంటూ ఉంటాడు. ఆ మర్నాడే రోగి గుటుక్కుమన్నా సరే... ఏమండీ డాక్టరుగారూ నిన్న అలా అన్నారూ? అని యెవరూ ఆయన్ని అడగరు.

ఇంతవరకూ రాసింతర్వాత ఒక మిత్రుడికి ఇదంతా చదివి వినిపించి ఎలా ఉందని అడిగేను. వెంటనే అతడు తడుముకోకుండా... యేదో పర్వాలే...దన్నాడు. అందులో ఉన్న సూచనను అంగీకరించి ఇంతటితో ఇది చాలిస్తున్నాను.

[ఆలిండియా రేడియో (మద్రాసు) సౌజన్యంతో]

---

ఆతడు తర్కశాస్త్రంలో నిధి. అయితేనేం జీవితమంటే అతనికి విరక్తి కలిగింది. బ్రిడ్జీమీదనుంచి నదిలోకి ఫురికి చచ్చిపోదామని బయలుదేరాడు. తీరా దూకబోయే సమయానికి ఓ పోలీసు చూశాడు. 'ఏయ్! ఆత్మహత్య నేరం. నువ్వు అటువంటిపని చెయ్యకూడదు.' అని ఆపుచేశాడు.

'ఎందుకు చెయ్యకూడదూ?' అని పండితుడు గర్జించాడు. ఇద్దరూ ఘోరమైన వాదనలోకి దిగారు.

కొన్ని నిముషాల తరువాత యిద్దరూ కలిసి నదిలోకి దూకేశారు.

Source: Press Academy Website, Telugu Swatantra Patrika, June 1954

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/